క్లుప్తంగా

రగ్గుల పంపిణీ



వృద్ధులకు రగ్గులు పంపిణీ చేస్తున్న కొండబాబు తదితరులు

సీటీఆర్ఐ: గౌతమీ జీవకారుణ్య సంఘంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులకు ఆ సంఘం చైర్మన్ బర్రే కొండబాబు, డైరెక్టర్లు గురువారం రగ్గులు పంపిణీ చేశారు. వీటిని పలు సందర్భాల్లో దాతలు సమకూర్చారు. కొండబాబు మాట్లాడుతూ చలికాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో వృద్ధులు ఇబ్బంది పడకుండా రగ్గులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో బోర్డు డైరెక్టర్లు నాగులాపల్లి దేవీ లక్షణ రావు, బొల్లంగి ఏడుకొండలు, పైడా వాసు, ఆఫీసు సిబ్బంది విజయ్ కుమార్, దత్తాత్రేయ పాల్గొన్నారు.

సెంట్రల్ జైలులో సదుపాయాల పరిశీలన



సెంట్రల్ జైలును సందర్శించిన న్యాయమూర్తి ప్రత్యూష కుమారి

కంబాలచెరువు: జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి కె.ప్రత్యూష కుమారి గురువారం సెంట్రల్ జైలును సందర్శించారు. కారాగారం ఆసుపత్రిలో అందుతున్న సదుపాయాలను పరిశీలించారు. ఖైదీల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అక్కడ ఉన్న లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను సందర్శించి, న్యాయ సమస్యలున్న వారు జిల్లా న్యాయసేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావాలన్నారు. ఖైదీలు సత్ప్రవర్తనతో గౌరవంగా జీవించాలన్నారు. మానసిక ఆరోగ్యం మెరుగుపర్చుకునేందుకు యోగా, ధ్యానం చేయాలన్నారు. అనంతరం కారాగారంలోని వంటశాల, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు.

గ్యాస్ సిలిండర్ల పట్టివేత



హోటల్లో గుర్తించిన గృహావసరాల సిలిండర్లు

కంబాలచెరువు: గృహావసరానికి వాడే గ్యాస్ సిలిండర్లను అక్రమంగా వ్యాపారానికి ఉపయోగిస్తుండగా విజిలెన్స్ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఇన్‌చార్జి రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.కుమార్ ఆదేశాల మేరకు శ్యామలా నగర్‌లోని విజయ అమృత హోటల్‌పై అధికారులు గురువారం దాడి చేశారు. అక్కడ గృహావసరానికి ఉపయోగించే ఐదు గ్యాస్ సిలిండర్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. హోటల్ యజమాని రాయుడు రాంబాబుపై కేసు నమోదు చేశారు. అలాగే హోటల్లో స్టాంప్ లేని తూనిక యంత్రం ఉపయోగిస్తున్నందున లీగల్ మెట్రాలజీ అధికారులు మరో కేసు నమోదు చేశారు. తనిఖీల్లో కార్యాలయ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, జియాలజిస్ట్ లక్ష్మీనారాయణ, కానిస్టేబుళ్లు లోవ కుమార్, కిషోర్, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: సెంట్రల్ జైల్ ఫీడర్ లైన్‌లో పనులు, మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. దీని ప్రభావంతో మల్లికార్జున నగర్, సువిశేషపురం, సెంట్రల్ జైల్ క్వార్టర్లు, మెడికల్ కాలేజ్ ఏరియాల్లో సరఫరా ఉండదన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

కంబాలచెరువు: స్థానిక కంటిపూడి రామారావు ఉన్నత పాఠశాలలో గురువారం ఆర్ట్స్ కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మోల్ డేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రసాయన శాస్త్రంపై ఆసక్తిని పెంపొందించడంలో భాగంగా మోల్‌డేని ప్రారంభించారని స్కూల్ హెచ్‌ఎం పులుగుర్త దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఆర్ట్స్ కళాశాల రసాయన శాస్త్ర విభాగాధిపతి టి.శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సారా విక్రయిస్తున్న మహిళ అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడు గ్రామంలో సారా విక్రయిస్తున్న పలివెల నాగమణిని గురువారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఈబీ నార్త్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ తెలిపారు. ఆమె నుంచి పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న ఎంపీ భరత్ రామ్, సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్, రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్, కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీష్, కమిషనర్ దినేష్ కుమార్, షర్మిలారెడ్డి

ఉప్పొంగిన అభిమానం

- ఘనంగా జక్కంపూడి వివాహ రిసెప్షన్
- తరలివచ్చిన అభిమానులు

రాజమహేంద్రవరం సిటీ: దివంగత మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు కుమారుడు, ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా సోదరుడు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ వివాహ రిసెప్షన్‌కు భారీ ఎత్తున అభిమానులు తరలి వెళ్లారు. దివాన్ చెరువులోని డీబీవీ రాజు లేఅవుట్‌లో గురువారం ఈ వేడుక జరిగింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఆయనకు ఎంపీ భరత్ రామ్, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్లు డాక్టర్ గూడూరి శ్రీనివాస్, చందన నాగేశ్వర్, కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీష్, కమిషనర్ దినేష్‌కుమార్, రుడా మాజీ చైర్ పర్సన్ షర్మిలారెడ్డి స్వాగతం పలికారు.



దివాన్ చెరువు డీబీవీ రాజు లేఅవుట్‌లోని రిసెప్షన్ ప్రాంగణంలో కిక్కిరిసిన అభిమానులు

అపర్ణాదేవికి వెండి కిరీటం సమర్పణ



వెండి కిరీటం అందజేస్తున్న ఆంజనేయులు, వీరవేణి దంపతులు

కడియం: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలోని అపర్ణా సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో కొలువైన అపర్ణాదేవికి సత్యదేవా నర్సరీ అధినేత పుల్లా ఆంజనేయులు, వీరవేణి దంపతులు అరకేజీ వెండి కిరీటం సమర్పించారు. కిరీటాన్ని గురువారం దేవస్థానంలో అర్చకులు కడియం నరసింహ మూర్తి శర్మ చేతుల మీదుగా అమ్మవారికి అలంకరించారు.

గోదావరి జిల్లాల యువతలో అద్భుత ప్రతిభ



1/3 మూవీ సాంగ్, టైటిల్‌ను ఆవిష్కరిస్తున్న జిత్‌మోహన్‌మిత్ర, కమెడియన్ భద్రం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): గోదావరి జిల్లాల యువతలో అద్భుత సినిమా ప్రతిభ ఉందని నట గాయకుడు శ్రీపాద జిత్ మోహన్ మిత్ర అన్నారు. గోదావరి మూవీ ఆర్టిస్టుల అసోసియేషన్ సభ్యుల నేతృత్వంలో సాయి మహేష్ దర్శకత్వంలో నిర్మాత టి.గోవిందరెడ్డి, నటీనటులు జి.మహేష్, షెహన్ షా, నందిని, దీపక్, వెంకట్ నటించిన 1/3 మూవీ లిరికల్ సాంగ్, టైటిల్ సాంగ్ ఆవిష్కరణ కార్యక్రమం స్థానిక జిత్ మోహన్ మిత్ర కళావేదికపై గురువారం నిర్వహించారు. పాటను ఆవిష్కరించిన జిత్ మోహన్ మిత్ర మాట్లాడుతూ తెలుగు చిత్రసీమలో ఎందరో దర్శకులు, సంగీత దర్శకులు ఎన్నో అద్భుత చిత్రాలు తీశారని, ఎన్నో ఆణిముత్యాల వంటి పాటలు వచ్చాయన్నారు. వాటికి ఏమాత్రం తీసిపోకుండా 1/3 చిత్రంలోని పాట ఉందని కితాబిచ్చారు. హాస్యనటుడు భద్రం చిత్రం టైటిల్ విడుదల చేశారు. నిర్మాత టి.గోవింద రెడ్డి మాట్లాడుతూ సినిమాను త్వరలో థియేటర్లలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. దర్శకుడు సాయి మహేష్ మాట్లాడుతూ ఈ సినిమా చాలా బాగా వచ్చిందన్నారు. కో డైరెక్టర్ డీఎస్ శ్రీనివాసరావు, ఆర్కే స్టడీ సెంటర్ అధినేత, నటుడు పులప రామకృష్ణ, సంగీత దర్శకుడు అసద్ జె, డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ వినోద్, గిరజాల సోమరాజు నాయుడు, బషీర్, పిచ్చుక మహేష్, అడబాల మరిడయ్య, శ్రీపాద శంకర రావు, నాగ భూషణం పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్ర ప్రదేశ్ సాధనే జగన్ లక్ష్యం



కడియంలో మందులు పంపిణీ చేస్తున్న గిరజాల బాబు, సతీష్‌చంద్ర స్టాలిన్

కడియం: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధన దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ పేర్కొన్నారు. గురువారం కడియం గ్రామసచివాలయం-1 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. స్పెషలిస్టు వైద్యులు సాయి భావన, జి.శ్రీనివాస్, కడియం పీహెచ్‌సీ వైద్యులు జ్యోత్స్న, మౌర్య, స్వరూప వైద్యసేవలు అందించి మందులు పంపిణీ చేశారు. శిబిరంలో 563 మందికి వైద్యసేవలు అందించగా, 18 మందిని ఆరోగ్యశ్రీనెట్‌వర్క్ ఆసుపత్రిలకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌అండ్‌ఆర్డీ వై.వాణి, ఎంపీటీసీ స్వప్నచిన్ని, మాజీ సర్పంచ్ దాసరి శేషగిరి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు దొడ్డా బుజ్జి పాల్గొన్నారు.

హుకుంపేటలో..

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట -2 గ్రామ సచివాలయం పరిధిలో డిబ్లాకులో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో 626 మందికి వైద్యసేవలు అందించారు. 27 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రిలకు రిఫర్ చేశారు. ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.సుధాకర్ సచివాలయ కన్వీనర్లతో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. స్పెషలిస్టు వైద్యులు లక్ష్మీనాగేశ్వరి, శౌర్య సుమన, ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.సుధాకర్ నేతృత్వంలో లిడియా సుచిత్ర, కె.నాగదుర్గ, జగదీష్ కృష్ణ రోగులకు వైద్యసేవలు అందించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి గుంటూరు వెంకటరావు, సచివాలయ కన్వీనర్లు తెలగ రెడ్డి శ్రీనివాస్, మచ్చా దుర్గాప్రసాద్, పార్టీ నాయకులు బండి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



హుకుంపేటలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

16వ డివిజన్‌లో చందన నాగేశ్వర్ పర్యటన



16వ డివిజన్‌లో డ్రైనేజీని పరిశీలిస్తున్న రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక 16వ డివిజన్‌లోని డ్రైనేజీలు, కల్వర్టులను గురువారం ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ పరిశీలించారు. ఇటీవల డివిజన్‌లోని స్థానికులు తమ ప్రాంతంలో పలుచోట్ల డ్రైనేజీలు సరిగ్గా లేవని, వాటిలో సిల్ట్ తీయించాలని ఆయనను కోరారు. ఈ నేపథ్యంలోనే చందన నాగేశ్వర్ ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. పెద్ద డ్రైనేజీల్లో సిల్ట్‌ను మెషీన్లతో తీయించాలని నగరపాలకసంస్థ అధికారులకు సూచించారు. నగరాభివృద్ధిలో భాగంగా కొత్తగా ఏర్పడిన ప్రాంతాలలో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. దీనికి సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. తాడితోట నుంచి తూర్పు రైల్వేస్టేషన్ వరకూ ఉన్న 60 అడుగుల రోడ్డును 100 అడుగులుగా నిర్మించాలని ఆయన తెలిపారు. రాష్ట్ర శెట్టిబలిజ, గౌడ, ఈడిగ కార్పొరేషన్ చైర్మన్ పాలిక శ్రీను, పెయ్యల రాజేష్ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు ప్రణాళికలు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ దినేష్ కుమార్ పోలీస్ అధికారులకు సూచించారు. గురువారం నగర పాలక సంస్థ కార్యాలయంలో పోలీస్ అధికారులు, ఎన్నికల అధికారులతో ఆయన సమీక్షించారు. రాజమహేంద్రవం సిటీ నియోజక వర్గంలో 232 పోలింగ్ స్టేషన్‌లలో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. సాధారణ, సమస్యాత్మక, అతి సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాలన్నారు. అవసరమైన పోలింగ్ కేంద్రాల వద్ద సిబ్బందిని ఏవిధంగా ఏర్పాటు చేయాలనే విషయమై నివేదిక అందజేయాలన్నారు. సమస్యలున్న ప్రాంతాలను గుర్తించి ఎన్నికలు సజావుగా జరిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి

- కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్
- 13వ డివిజన్‌లో పర్యటన



సమస్యలను పరిశీలిస్తున్న సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 13వ డివిజన్ ఇన్‌చార్జి, నగర మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి మార్తి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం ఆయన క్షేత్ర స్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను పలువురు ఆయన దృష్టికి తీసుకుని వచ్చారు. డివిజన్‌లోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాలు ఆకతాయిలకు ఆలవాలంగా మారి, భద్రత కరువైందన్నారు. నగరపాలక సంస్థ పర్యవేక్షణ లోపించిందని, తక్షణమే స్థానిక ప్రజలకు ఉపయోగపడేలా ఈ హాలును పరిరక్షించాలని కోరారు. సీసీ రోడ్లు వేసేటప్పుడు పాత కుళాయి పైపులైన్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. అంబేడ్కర్ నగర్ డోర్ నెంబర్ 45.46.3 సమీపంలో బోరును పునరుద్ధరించాలన్నారు. వీర వెంకాయమ్మ ఎయిడెడ్ పెంకుటిల్లు పాఠశాల స్థలం నిరుపయోగంగా ఉందని, దాన్ని స్థానిక అవసరాలకు అభివృద్ధి చేయాలని కోరారు. కుళాయిలకు మూతలు లేకపోవడంతో తాగునీరు వృథాగా పోతోందన్నారు. అంబేడ్కర్ నగర్ మధ్య వీధిలో డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని, వాటర్ పైపులైన్ ప్రెజర్ పెంచాలని కోరారు. స్థానికుల సమస్యలు విన్న శ్రీనివాస్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ తక్షణమే సమస్యలపై చర్యలు చేపట్టాలని సూచించారు.

ఒకటి నుంచి జనం బాట

ప్రకాశం నగర్: నవంబర్ ఒకటి నుంచి 15వ తేదీ వరకూ నిర్వహించే సీపీఐ జనం బాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు కోరారు. ఈ కార్యక్రమం ద్వారా 15 రోజుల పాటు ప్రతి వార్డులో ప్రతి వ్యక్తిని కలిసి సమస్యలు తెలుసుకుంటామన్నారు.

స్నానఘట్టాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

- దృష్టి సారించిన పంచాయతీ అధికారులు
- కార్తిక మాసం నేపథ్యంలో చర్యలు



ధవళేశ్వరంలోని రామపాదాల రేవు

ధవళేశ్వరం: గ్రామంలోని పురాణ చరిత్ర కలిగిన రామపాదాల రేవు వద్ద పంచాయతీ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. కార్తికమాసం ప్రారంభం కానుండటంతో ముందస్తుగా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించారు. కార్తికమాసంలో నెల రోజుల పాటు నిత్యం వేల మంది రామపాదాల రేవు వద్ద పుణ్యస్నానాలు ఆచరిస్తారు. రామపాదాలరేవు సమీపంలోనే ప్రసిద్ధ అగస్త్యేశ్వరస్వామి ఆలయం ఉంది. గ్రామంలోని భక్తులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు ఇక్కడ పుణ్యస్నానాలకు వస్తుంటారు. దీంతో పంచాయితీ అధికారులు ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టిసారించారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో సిబ్బందికి పంచాయతీ కార్యదర్శి సూరిబాబు పలు సూచనలు చేశారు.

రక్షణ చర్యలు

రామపాదాల రేవు వద్ద బురద పేరుకుపోవడంతో ఇసుక వేసేందుకు చర్యలు చేపట్టారు. భక్తులు లోతుకు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు రామపాదాల రేవు వద్ద ప్రత్యేక లైటింగ్ పెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే చెత్తను తొలగించే కార్యక్రమం చేపట్టారు. దుస్తులు మార్చుకునేందుకు ప్రస్తుతం ఉన్న గదులు సరిపోకపోతే ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు.

నెల రోజుల పాటు సందడి

కార్తికమాసం ప్రారంభం కానుండటంతో రామపాదాల రేవు వద్ద నెల రోజుల పాటు సందడి నెలకొననుంది. సాధారణ రోజులలో సైతం ఇక్కడ పుణ్య స్నానాలు ఆచరించేందుకు భక్తులు అధికసంఖ్యలో వస్తారు. కార్తిక మాసంలో ఈ సంఖ్య మరింత పెరుగుతుంది. ముఖ్యంగా సోమవారాల్లో ఇక్కడ పుణ్యస్నానాలు ఆచరించి, గోదావరిలో దీపాలను వదులుతారు. దీనిని దృష్టిలో ఉంచుకుని అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ప్రతి రోజూ ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌ను ఏర్పాటు చేసేందుకు పంచాయతీ అధికారులు దృష్టి సారించారు.

ప్రత్యేక ఏర్పాట్లు



స్నాన ఘట్టాల వద్ద ఎటువంటి ఇబ్బందుల లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ చేపట్టాం. రామపాదాల రేవు వద్ద ఇసుక వేయడంతో పాటు బారికేడ్లను ఏర్పాటు చేస్తాం. స్నానఘట్టాల వద్ద లైటింగ్ కూడా సిద్ధం చేస్తాం.

– డి.సూరిబాబు, గ్రామ పంచాయతీ కార్యదర్శి, ధవళేశ్వరం

మహాన్నదానం



అన్నదానం చేస్తున్న ఎస్‌వీబీ నిధి ఫౌండర్ లోవరాజు

రాజమహేంద్రవరం రూరల్: ఎస్‌వీబీ నిధి ఆధ్వర్యంలో లాలాచెరువు స్వరూప్ నగర్‌లోని సాయిబాబా మందిరం వద్ద శరన్నవరాత్ర ఉత్సవాల ముగింపులో భాగంగా గురువారం మహాన్నదానం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అన్నప్రసాదం స్వీకరించారు. ఎస్‌వీబీ నిధి ఫౌండర్ కె.లోవరాజు మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా సాయిబాబా మందిరం వద్ద భక్తులకు మహాన్నదానం చేశామన్నారు. సీఈవో వెంకట తిరుమల, ఉపాధ్యక్షుడు పల్లా రాము, డైరెక్టర్ కంటిపూడి సునీల్ భరద్వాజ్ ప్రోత్సాహం, సిబ్బంది సహకారంతో ఈ కార్యక్రమం జరిగిందన్నారు.


ఘనంగా బాబా సమాధి మహోత్సవాలు

మధురపూడి: బాబా సమాధి మహోత్సవాల ముగింపు వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఆలయ గురువు మామిడిపల్లి రామారావు ఆధ్వర్యంలో బూరుగుపూడి ప్రధాన వీధుల్లో బాబా వారిని ఊరేగించారు. దీనిలో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. అనాథలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కంటే నాగకేశవరావు, నాయకులు కంటే సత్యచక్ర గణపతి, మూతిన శివమోహన్, గూడపాటి వెంకటేశ్వరరావు, ఏవీఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు. ఈనెల 24న ఈ ఉత్సవాలను ప్రారంభించిన విషయం తెలిసిందే.

ఈ–క్రాప్ జాబితా ప్రదర్శన

మధురపూడి: కోరుకొండ మండలంలో ఖరీఫ్ సీజన్‌లో 13,025.94 ఎకరాల పంట సాగుకు ఈ–క్రాఫ్ పూర్తయినట్టు వ్యవసాయశాఖ జిల్లా అధికారి మాధవరావు తెలిపారు. కోరుకొండలోని ఆర్‌బీకే-2 కేంద్రాన్ని ఆయన గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అన్ని సేవలూ అందుతున్నాయన్నారు. ఈ–క్రాఫ్ ముసాయిదా జాబితాను రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శిస్తున్నామన్నారు. దానిలో భాగంగా కోరుకొండ ఆర్‌బీకే-2లో ముసాయిదా జాబితాను ప్రదర్శనకు ఉంచామన్నారు.

సాక్షి - సినిమా



శ్యామల :	లియో
సూర్యమినీ :	భగవంత్ కేసరి
సూర్యప్యాలెస్ :	టైగర్ నాగేశ్వరరావు
స్వామి :	టైగర్ నాగేశ్వరరావు
శివజ్యోతి :	మార్టిన్ లూథర్ కింగ్
అనుశ్రీ :	భగవంత్ కేసరి
రాజా :	టైగర్ నాగేశ్వరరావు
అశోక :	భగవంత్ కేసరి
ఊర్వశి :	మ్యాడ్
రంభ :	ఓటు
మేనక :	ఒక్కడే
అప్సర :	లియో
నామవరం	
వీఎస్ మహల్ :	భగవంత్ కేసరి
ధవళేశ్వరం	
మురళీకృష్ణ :	భగవంత్ కేసరి, లియో
కడియం	
వెంకటసూర్య :	టైగర్ నాగేశ్వరరావు